# రత్న పాప

శరీరంలో శరీరం... రక్తంలో రక్తం... రూపానికి ప్రతిరూపం. ఈ చిన్నారి జీవం... అప్పుడే కళ్ళు విప్పిన కందు... తన కడుపు చించుకు వచ్చిన చిరు ప్రాణాన్ని సంభ్రమంగా చూసింది రత్నం....

పువ్వుల్నీ, వెన్నెల్నీ చూస్తే దుఃఖోపశమనం కలుగుతుంది. వర్షానికి తడిసి వళ్ళు ఆరబెట్టుకుంటున్న ప్రకృతిని చూసినా పులకరింతే... కానీ వాటికన్న ఎన్నో రెట్లు అందమైన ఆనందదాయకమైన ఈ చిన్నారి చిరుజీవాన్ని చూసినప్పుడు కలగవలసిన ఆనందం. కాసేపే కలిగి అంతలోనే మాయమై పోయింది. కారు మేఘాలు కమ్మి ఇప్పుడో, ఇంకాసేపటికో కురవబోయే ఆకాశంలా వుంది మనసు.

అవును... ఒక్కొక్క చెమటబిందువూ ఒక్కొక్క రూపాయిగా శ్రమించి, సంచెడు రూపాయిలు పోగేసుకుని ప్రాణప్రదంగా దాచుకుంటే, అవి నీవికావు పొమ్మని ఎవరైనా లాగేసుకుంటే ఎట్లా వుంటుంది? ఈ పోలిక తప్పు... రూపాయికి ప్రాణం లేదు. అది పాపాయికి సరైన పోలికే కాదు.

రత్నానికి చదువు లేదు. కథలూ, నవలలూ చదవలేదు. సినిమాలు కూడా చూడదు... ఆమెకు బాషలేదు కానీ భావాలున్నాయి. శరీరంలో రక్తం, మెదడులో ఆలోచనా, హృదయ స్పందనా వున్న రత్నానికి భావాలూ, అనుభూతులూ అర్థం అవుతున్నాయి. ఇప్పుడు తన వొళ్ళోపడిన పసి ప్రాణాన్ని చూస్తుంటే!!! రత్నం పాపని ఆత్రంగా గుండెకి హత్తుకుంది. దాని లేలేత పెదవుల్ని తన వేలితో సున్నితంగా తాకింది. ఆమె హృదయం ఉప్పొంగింది. "ఇది నాది. నా రక్తం... నా ప్రాణం... నా జీవితం ఖరీదిది" అనే భావనకి ఆమె కళ్ళనిండా నీళ్ళొచ్చాయి.

ముప్పై అయిదేళ్ళ రత్నం. ఎన్నడూ, దేనికీ ఇంతగా అలమటించని రత్నం.

ఆడవాళ్లు కష్టపడ్డానికే పుట్టారని గాఢంగా నమ్మిన రత్నం, తను ఎదుటివాళ్ళని సుఖపెట్టడానికే పుట్టానని నమ్మిన రత్నం, ఈ క్షణాన మాత్రం అట్లా అనుకోలేకపోతోంది. ఆ నమ్మకాలన్నీ తప్పేమో అనిపిస్తోందిప్పుడు.

పక్క మంచం మీద ఇరవై ఏళ్ళయినా నిండని బాలింత! పచ్చని ముఖం. తలకి ఎర్రని మఫ్లర్ చుట్టింది. అతను వచ్చాడు. ఆమెకి సంతాన భిక్ష పెట్టిన వాడు. మెడలో మంగళసూత్రం కట్టి సంఘం ఆమోదం పొందినవాడు. బిడ్డని ఎత్తుకుని మురిసిపోతున్నాడు. ఎంత బాగుందో వాళ్ళని అట్లా చూడ్డం!! పటం కట్టించి దాచుకోవాలనిపించే దృశ్యం! వాళ్ళ ఆనందం లోనే దేవుడున్నాడు. మరీ మరీ చూడాలనిపిస్తోంది.

రత్నం తల్లి వచ్చింది.

"ఇంద!! కాఫీ తాగు. ఇక్కడితో మన కష్టాలు తీరిపోయినయ్."అంది.

రత్నానికి ఆ కాఫీ తాగ బుద్ధి కాలేదు. మూడు రోజుల ప్రసవ వేదన అనంతరం శరీరం భారంగా వుంది. నీరసంగా వుంది. అయినా వందేళ్ళ తపస్సు చేస్తే దేవుడు వరాలిస్తాడని హరికథ పంతులు చెప్పినట్లు, తను పడ్డ కష్టానికి దేవుడిట్లా తనకి వరం ఇచ్చాడేమో! నీరసం, ఆకలి అన్నీ మర్చిపోయింది రత్నం. ఆమె తల్లి ఎప్పుడూ చాలా గంభీరంగా వుంటుంది. నవ్వడం మహా పాపం అన్నట్లు. ఆడవాళ్ళెప్పుడూ నవ్వరాదని నమ్మిన మనిషి.

"ఎంత ముద్దొస్తోందో! మాయదారి ముండ!" అందావిడ. పిల్లని తీసుకుని రత్నానికి కాఫీ గ్లాసు ఇస్తూ... రత్నానికి నవ్వొచ్చింది.. ఆ పక్కమంచం మీద పిల్ల బంగారు తల్లి. ఇదేమో మాయదారి ముండ..."

"అమ్మా! విను! ఇది మాయదారి ముండ కాదు. నా బంగారు కొండ... నా కడుపులోంచి వచ్చింది. నాదమ్మా అది... నా స్వంతం" అని చెప్పాలని వుంది. కానీ ఆవిడతో అలా అనడం కష్టం. అమ్మంటే భయం రత్నానికి.

"కాఫీ తాగు" అంది తల్లి.

యాంత్రికంగా ఆ బుల్లి గ్లాసులో కాఫీ గొంతులో పోసుకుని తల్లి మొహం కేసి చూసింది. అందులో చాలా అలసట, ఆవేదన కనిపిస్తున్నాయి. మూడు రోజులుగా కంటికి కునుకు లేకుండా తనని కంటికి రెప్పలా కాచిన తన కన్నతల్లి... తను ఆమె బిడ్డ. ఆమె రక్తంలో రక్తం.

'అయిదు నెల్లాయె వూరొదిలి. ఇల్లూ, మీ నాయన ఎట్టా వుండారో ఏమో!! ఎల్లుండి పత్యం తిని రేతిరి బండెక్కుదాం.. అమెరికాస్పత్రి దొరసానమ్మతో మాట్లాడం, అంతా అయిపోయింది" అంది తల్లి. తను కూడా కాఫీ తాగుతూ.. ఆవిడ ప్రాణం కుదుట పడింది. ఇక రత్నం ఎప్పటికీ తనదే.

"మీ వదిన ఇల్లంతా సద్దేసుంటుంది. మన సామాన్లన్నీ చేరేసుంటుంది. గడుసు

ముండ. మామకైనా తిండిపెడతాందో లేదో!! తాగేసి ఆమైనే పడుంటున్నాడో ముసలాడు.." అని నిట్టూర్చింది. ఆమె ఇంటినీ, మొగుణ్ణీ తలుచుకుంటోంది.

"పది రోజులు ఇంటికాడుండి మళ్ళీ డాక్టరమ్మనే పని అడుగు.. బంగారమట్టాంటి పని" అంది. కాసేపాగి మళ్ళీ అందుకుని

"మనేది పెట్టుకోమాక.... ఇయ్యన్నీ జరుగుతానే వుంటయ్ ఉప్పూ, కారం తినేటోళ్ళకి.. గండం గడిచి పొద్దున పడ్డాం" అంది.

రత్నం ఉలిక్కిపడింది. అమ్మే కాదు వదినె కూడా ఇట్లానే అంది.

"నీ చెల్లెలు సూరేకాంతం మాత్తరం బయటికెళ్ళి పన్చెయ్యటంలా? అదింకా సినిమాలనీ, అదనీ, ఇదనీ తిరుగుతా వుంటది. నీలాగా ఇంత అసమరదంగా నా? అది శానా తెలివిగలది... నువ్వొట్టి మాలోకానివి" అని నవ్వింది. అప్పుడు రత్నానికి ఆవిడమీద చాలా కోపం వచ్చింది. 'అవును మరి, గదిన్నర ఇంట్లో తడికె పెట్టి వేరే పోయావు. కానీ ఆ తడిక వెనకే నేను రోజూ పడుకుని నువ్వూ, నీ మొగుడూ చేసే కిలకిలలూ, కలకలలూ వింటూ నెత్తిన చెంగేసుకుంటాను' అనుకుంది. నిజంగానే తను నెత్తిన చెంగే వేసుకుంది అప్పటిదాకా! వదినేనా? ఆమె అత్త, అదే తన తల్లి, తనకన్న ఎంతో పెద్దది. ముప్పై అయిదేళ్ళ విధవ కూతుర్నీ, పాతికేళ్ళ పెళ్ళికాని కూతుర్నీ ఎదురుగా పెట్టుకుని తాగొచ్చిన మొగుడితో తైతక్కలాడితే ఏమీ పట్టనట్టు కళ్ళు మూసుకుని వుండాలా?

డాక్టరమ్మ గారి డ్రయివరు నాయుడు తనని పెళ్ళిచేసుకుంటానని ఇంటికొచ్చి అడిగితే తమ ఇళ్ళలో మారు మనువులు లేవని తరిమికొట్టింది అమ్మ... పైగా పనికాడ ఎవరితో మాట్లాడక బుద్ధిగా వుండమని గంటసేపు సోది చెప్పింది. అప్పుడు రత్నం నాయుడిని నమ్మలేదు. రత్నానికి అమ్మంటే భయమే కాదు భక్తి కూడా. భక్తికి కారణం వుంది. తన చిన్నప్పటినించీ ఆమె తాగొచ్చిన మొగుడితో తన్నులు తినడం, కుటుంబం గడపడానికి గొడ్డు చాకిరి చెయ్యడం ఎరిగున్నదే!'పాపం అమ్మ!' అనుకోని క్షణం వుందా? 'అన్ని దెబ్బలు తిని ఏ నుయ్యో, గొయ్యో చూసుకోకుండా తను బతికి వుండడం పిల్లల కోసమే' అని ఎన్నిసార్లు అన్నది! అమ్మని కాదని ఏ పనీ చెయ్యలేదు రత్నం. అందుకే తనని రెండో పెళ్ళికిచ్చినా కిమ్మనలేదు. పది కాసుల బంగారం పెట్టాడని అమ్మ ఓ మురిసిపోయింది. అతనికి స్వంతంగా ఒక ఇల్లుందని సంతోషించింది. రత్నానికి అతను నచ్చలేదు. అస్తమానూ అతను దగ్గుతూ బీడీలు కాలుస్తుండడం నచ్చలేదు. అతని మురికి పొళ్ళు అంతకన్న చీదర పుట్టింది. కానీ ఏం చేస్తాం! అమ్మ ఒప్పుకుంది. తనూ ఒప్పుకుంది. పెళ్ళి ఖర్చు అతనే పెట్టుకున్నాడు. తనకి రెండు మంచి చీరెలు కొన్నాడు. మంచి సంబంధం... పెళ్ళైన ఏడాదికే అతని క్షయ వ్యాధి బయటపడింది. దానికి పదికాసుల బంగారం కరిగిపోయింది. అతనూ పోయాడు. ఇల్లు పెద్ద భార్యకొడుక్కి ఎప్పుడో రాసేశాడని అప్పుడు తెలిసింది. రత్నం అమ్మ

దగ్గరకొచ్చింది. ఇల్లూ, బంగారమూ పోయినా రత్నానికున్న రెండు చేతులని అమ్మ అక్కున చేర్చుకుంది.

రత్నం బుద్ధిమంతురాలు. దానికి చాటు తిళ్ళూ, తిరుగుళ్ళూ లేవు. అది విధవై తిరిగొచ్చిన వేళ మంచిది. దానికి మంచి పని దొరికింది. దాని తిండి రెండుపూటలా అక్కడే. కట్టే బట్టలూ వాళ్ళిచ్చేవే. పైగా అది పనిచేసేది డాక్టరమ్మ దగ్గర కనుక ఇంటిల్లపాదికీ జొరానికి, తలనెప్పికి మందులూ ఉచితమే. రత్నం అమ్మ పాలిట రత్నమైంది. తన తిండీ బట్టా అక్కడే గడిచిపోతున్నాయి గనక జీతం తెచ్చి మొత్తం అమ్మ చేతిలో పోసేది. డ్రయివర్ నాయుడు చెప్పేవాడు "పెళ్ళి చేసుకో రత్నం. నీకూ పిల్లా, పాపా కావద్దా? నీకేదైనా వస్తే చూసేవాడుండద్దా?" అనేవాడు. "నాకేంటి నాయుడూ, నా అన్న పిల్లలే నా పిల్లలు. నా చెల్లెలే నాకు తోడు. అదే నన్ను చూసుకుంటుంది. అన్న కొడుకుని పెంచుకుంటా..." అనేది రత్నం. చెల్లెలు సూరీడు పనిచేసినా జీతం అంతా అమ్మకివ్వదు. పైగా పెళ్ళి చెయ్యలేదని సతాయిస్తూ వుంటుంది. అమ్మ తెచ్చిన మనువులు దానికి నచ్చవు. దానికి ఖర్చులున్నయ్ వారానికో సినిమా అప్పుడప్పుడూ హొటల్ కాఫీంచీ టిఫినీలు... తల పిన్నులు, పౌడర్లు అట్లా అవన్నీ రత్నానికి లేవు. వదిన పనికి పోదు. వేరే కాపురం పెట్టింది. అన్న డబ్బు మీద అమ్మ కే ఆశా లేకుండా చేసింది. ఎప్పుడైనా ఒక వంద రూపాయలు రాలుస్తుంది. ఎప్పుడైనా డాక్టరమ్మ ఇంట్లో విందులూ, పండగలూ, పబ్బాలూ అయితే ఆమె ఇంటికి పట్టుకు పొమ్మని ఇచ్చే పిండివంటలూ అవీ అన్న పిల్లలకే ఇస్తుంది. వాళ్ళకేవైనా కొనిపెట్టాలంటే తన దగ్గర డబ్బులన్నీ అమ్మకే యిస్తుంది కదా? అట్లా సజావుగా సంపాదిస్తూ పరోపకారానికే తన శరీరం అన్నట్లు బ్రతుకుతున్న రత్నం జీవితం అనుకోకుండా మలుపు తిరిగింది.

తను చూడ్డానికి బాగుంటానని, తన శరీరంలో కూడా వొంపుసొంపులుంటాయని, తనూ ఎవర్నైనా ఆకర్షించగలనని రత్నం ఎప్పుడూ ఆలోచించలేదు. ఆ ప్రసక్తి అసలు రానే లేదు. చక్కగా సబ్బుతో స్నానం చేసి ఉన్న నాలుగు చీరెలూ శుభ్రంగా ఉతుక్కుని జుత్తు ముడేసుకుని తలవంచుకుని పని చేసుకుపోవడమే తెలుసు. డాక్టరమ్మ గారి భర్త, ఆయన్ని పెద్ద డాక్టరు గారంటారు. ఆయన తను కాఫీ ఇచ్చినా, అన్నం వడ్డించినా తనొక యంత్రంలానే చూస్తాడు. నాయుడు పెళ్ళి చేసుకోమని అడిగాడే కానీ ఇటువంటి ప్రసక్తే తేలేదు. అప్పుడు డాక్టరమ్మ గారి మరిది గారొచ్చారు. సాయంగా పెద్ద డాక్టరుగారి తమ్ముడే కానీ ఆయన చూపులోనే తేడా వుందనుకుంది రత్నం. పెద్ద డాక్టరుగారు గానీ, డాక్టరమ్మ గానీ ఇంట్లో వుండేదే తక్కువ.. అన్నం తినటానికి, నిద్రపోడానికి తప్ప ఇంట్లో వుండే తీరికే లేదు వాళ్ళకి తను ఇంటి మనిషిలా అన్నీ అమర్చడం ఆవిడకెంతో సంతోషం. మరిదిగారికి పనేమీ లేదు. అతను రత్నం వెనకే తిరిగేవాడు. కబుర్లల్లో పెట్టి రత్నం స్థితిగతులన్నీ విచారించి ఆమె

పరిస్థితికి చాలా జాలిపడ్డాడు. అలా పడిపడీ, దగ్గరగా జరిగి, ఆమెనొకసారి తాకి, ఆమె ఒళ్ళు ఝల్లుమనిపించి, శరీరానిక్కూడా గౌరవం ఇవ్వాలని బోధించి, ఆ గౌరవాన్ని రుచి చూపించి, ఆమెని మైమరపించి, చక్కాపోయాడు. సుఖం సుఖమే. అందులో సుఖంలేదని రత్నం మాత్రం ఎట్లా అనగలదు? కానీ దానికి పర్యవసానాలుంటాయని ఆమె ఊహించలేదు. తను వాంతులు చేసుకోడం మొదలయ్యేదాకా!! ఆమె పరధ్యానంగా కూరలు మాడ్చడం, పనిమీద శ్రద్ధ తగ్గడం ఆమెలో ఒకరకమైన ఉదాసీనత డాక్టరమ్మ గమనించి విచారించే నాటికి సమయం మించే పోయింది. ఆమె ఎవరూ, ఏమిటి అని అడగలేదు. "కాస్త ముందయితే ఏదో ఒకటి చేసేదాన్ని!! ఇప్పుడు నీప్రాణానికే ప్రమాదం! నువ్వు పాపని కనాల్సిందే" అనేసింది ఆవిడ.

అమ్మకి మాత్రం చెప్పింది రత్నం. ఎవరూ ఏమిటని...

అమ్మ తొందరపడే మనిషి కాదు. పెద్దవాళ్ళతో కూడిన వ్యవహారం అని తెలుసు. నోరుమూసుకోమని చెప్పింది. ఎవరడిగినా ఏమీ చెప్పొద్దంది. 'రత్నం కడుపు ఎత్తుగా వుందేమిటీ" అని అంతా నోళ్ళు నొక్కుకోకముందే అమ్మ తనని వెంటబెట్టుకుని మామయ్య వూరుకొచ్చింది. పిల్లని అనాథాశ్రమంలో చేర్చడానికి మాట్లాడొచ్చింది. ఆవిడకి వయసైపోతోంది. కంటిచూపు మందగిస్తోంది. మగడు పూర్తిగా మంచంపట్టే స్థితికొచ్చాడు. కొడుకు సంపాదన వాడికుటుంబానికే చాలదు. రెండో కూతురికి పెళ్ళి చెయ్యాలి. ఇప్పుడిక రత్నమే దిక్కు

అయిదు నెలలయింది. ఇక్కడకొచ్చి. వచ్చిన పని అయింది. ఇక వెళ్ళిపోవాలి అనుకుంటోంది. ఆమె అలసటగా రత్నం మంచానికి ఆనుకుని పడుకుంది. రత్నం బిడ్డని మళ్ళీ మళ్ళీ చూసుకుంది. తప్పు చేసిన ఫలితమన్నారు మామయ్య.. అత్తయ్య కూడా అట్లాగే అంది. వీళ్ళంతా తప్పుచెయ్యకుండానే బిడ్డల్ని కన్నట్లు. తప్పో, ఒప్పో అది అట్లా జరిగిపోయిందంతే!! ఈ బిడ్డని అంతా తప్పనీ, పాపం అనీ అనడం తనకి నచ్చడం లేదు. ఇది తనది... ప్రపంచం మొత్తం మీద తనదంటూ వుంటే ఈ పాపే... అసలిది కడుపులోనే వుండిపోతే ఎంత బాగుండేది!! బయటికెందుకొచ్చినట్లు? తొమ్మిది కాదు తొమ్మిది తొమ్ముదులైనా తను కడుపులో దాచుకుని వుండేది. అటూ ఇటు కదులుతూ బుజ్జి బుజ్జి కాళ్ళతో తన పొట్ట గోడల్ని తంతూ గిలిగింతలుగా... ఎంత తొందరపడ్డావురా కన్నా! అనుకుంది రత్నం. పాపని ముద్దుపెట్టుకుని.

"బిడ్డకి పాలిచ్చావా?" అంది అప్పుడే వచ్చిన నర్సు.. లేదని తల తిప్పింది.

"ఇవ్వు" అని అక్కడే కూచుంది ఆవిడ.

"దీనికెవరు పాలిస్తారు ఇక.." అనుకుని ఉలిక్కిపడింది.

అందరికీ నేను... అమ్మకి... వదినకి... అన్న పిల్లలకి. మరి నాకెవరు? నాది

అయిన దాన్ని పరాయివాళ్ళకి పడేసి, నేను పరాయి పంచన బ్రతకాలా? ఎంతకాదన్నా ఆ పంచకి నా రెక్కలే కాని నేను అక్కర్లేదు... చీకటి పడుతున్న కొద్దీ రత్నం గుండె బరువైంది. ఈ చిన్ని చిన్ని పాదాలు చిన్నారి కళ్ళు... పాలు తాగడం కూడా ఇంకా రాని పెదవులు.. ఇది నాది నాది అని ఘోషిస్తోంది మనసు... రోజు గడిచింది. రత్నానికి పత్యం పెట్టారు.

"ఆళ్ళు పిల్లల్ని బాగానే చూస్తారంటలే. గొప్పోళ్ళెవరన్నా పెంచుకుంటానంటే ఇస్తారంట. చూద్దాం దాని అదురుట్టం ఎట్టాగుందో!! ఎంతకాదన్నా ఇదీ గొప్పింటి ఇత్తనమే గందా!!" అంది.

అన్న పిల్లలకి చిన్నప్పుడు తనే నీళ్ళు పోసేది రత్నం... కాళ్ళమీద వాళ్ళని బోర్లా వేసి మెత్తని సున్నిపిండితో జుత్తు రుద్ది వొంటికి నలుగు పెట్టి గోరువెచ్చని నీళ్ళు పోసి మెత్తని తువ్వాలుతో తుడిచి, సాంబ్రాణి పొగవేసి, గుడ్డ ఉయ్యాల్లో పడుకోబెట్టి నిద్రొచ్చేదాకా ఊపేది... దీనికా అదృష్టం యేదీ? డాక్టర్ గారి పెద్దపాపని రత్నమే పెంచింది.

"రేపీపాటికి రైల్లో వుంటాం." అంటోంది తల్లి... మళ్ళీ చీకటి పడింది.

"కంటినిండా నిద్రపో రత్నం! పెందలాడే లేచి డిచ్చార్జీ అయిపోవాలి. ఆనక మామయ్యింటికెళ్ళి అక్కడ్నించి అమ్రికాసుపత్రి కెళ్ళాల... పనయినంక సాయంత్రం బండికి మనూరికే" అంది.

రత్నం ఏమీ మాట్లాడలేదు. ఆవిడ బట్టలన్నీ రెండు సంచుల్లో సర్దింది. మంచం పక్క పాత చీరె పరుచుకుని పడుకుంది. రేపటితో కష్టాలు గట్టెక్కుతాయి. మళ్ళీ రత్నం పనికెడుతుంది. ముసలాడు పడకేసినా తాగినా, తన్నినా రత్నం తనకి అండ...

కాకుల కలకలకి ఉలిక్కిపడి లేచింది రత్నం తల్లి. అప్పుడే తూర్పు తెల్లవారింది. 'రత్నాన్ని లేపి మొహం కడిగించి తయారు చెయ్యాలి.' అనుకుంటూ లేచి ఆవలించి పక్కచీరె మడత వేసి సంచిలో పెడదామని చూస్తే సంచి లేదు. దాని కోసం వెతుకుతూ మంచం మీదకి చూస్తే దానిమీద రత్నం లేదు. ఉయ్యాల్లో పాప కూడా లేదు... రత్నం బాత్‌రూములోనూ లేదు. బయటా లేదు. ఆసుపత్రి మొత్తం మీద ఎక్కడా లేదు. మంచం పక్కన రెండవ సంచీ వుంది.... ఆమె అందులో వుండాల్సిన డబ్బుల సంచీ కోసం ఆత్రంగా చూసింది. ఆ సంచీ అయితే వుంది కానీ అందులో తను దాచి పెట్టుకున్న అయిదువందలు లేవు. తన రైలు ఛార్జీలకు సరిపడ యాభైరూపాయలున్నాయి. గుండె బాదుకుని పెద్దగా శోకాలు పెట్టడం మొదలుపెట్టింది.

"ఏమిటి గోల? ఏం జరిగింది?" అంటూ పైనించీ దిగివచ్చారు డాక్టర్ గారు.

"రత్నం అనే పేషెంటు పాపని ఎత్తుకుపోయిందట" అంది ఆస్పత్రి ఊడ్చే అమ్మాయి

"ఎవరి పాపని?" డాక్టర్ గారు కంగారు పడ్డారు.

"ఆమె పాపనే" అంది ఆ అమ్మాయి నింపాదిగా... *

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 1984)*